సాక్షి వరంగల్

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



నిబంధనల మేరకు ఖర్చు చేయాలి

నిధులను వ్యవసాయ మార్కెట్ల కార్యదర్శులు నిబంధనల మేరకు ఖర్చు చేయాలని మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ పి.రవికుమార్ ఆదేశించారు. - 8లో▸



గంజాయి విక్రయదారుల అరెస్ట్

ఎండు గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్న ఓ ముఠాను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. వారి నుంచి 1,100 గ్రాముల గంజాయి, ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$37^0 / 24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉండి, సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

ఇఫ్తార్	సహర్
మంగళ 6:35	బుధ 4:45

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలి



ఖానాపురం: ప్రతి బ్యాంక్ ఖాతాదారుడు ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకుంటూ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, ఖానాపురం బ్యాంక్ మేనేజర్ రమేష్‌రెడ్డిలు అన్నారు. ఈ మేరకు నాబార్డు ఆర్థిక సౌజన్యంతో ఖానాపురం ఏపీజీవీబీ ఆధ్వర్యంలో బండమీది మామిడితండా, కొత్తూరులో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన, బీమా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంక్ ఆధ్వర్యంలో వ్యవసాయ, పంట, మహిళా సంఘాలకు రుణాలు అందించడం జరుగుతుందని, రుణాలు తీసుకున్న ప్రతి ఒక్కరు సకాలంలో చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరాలు జరిగితే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. సర్పంచ్‌లు లక్ష్మి, రమ, భూస అశోక్‌యాదవ్, బ్యాంకు మిత్రలు, మహిళలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



చెన్నారావుపేట: గుండెపోటుకు గురైన వారికి తక్షణ శస్త్ర చికిత్సగా సీపీఆర్ చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు నెక్కొండ, అలంకానిపేట, చెన్నారావుపేట ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలా మంది గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని, అలా కాకుండా అందుబాటులో ఉన్న సిబ్బంది సీపీఆర్ (రెండు చేతులతో గుండెపై ప్రెసింగ్ చేయడం) రక్త ప్రసరణ జరిగే వరకు చేయాలన్నారు. దీంతో గుండెపోటుకు గురైన వ్యక్తి బ్రతికే అవకాశాలు ఉంటాయని వివరించారు. ఈ సదస్సులో వర్ధన్నపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు, వైద్యులు విజయ్, ఆచార్య, సరోజ, రాహీలాతన్వీర్, వైద్య సిబ్బంది ఉన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతులు చెన్నారావుపేట మండలానికి చెందిన వారు. వీరంతా తుంగబంధం పరిధిలో వరి పంటలు సాగు చేసుకున్నారు. అధికారులు సర్వేకు వెళ్లిన సమయంలో జిరాక్స్‌లు లేకపోవడంతో ఇవ్వలేదు. దీంతో కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఖానాపురం రైతువేదిక వద్ద జిరాక్స్ ఇచ్చేందుకు ప్రయత్నించగా.. సమయం ముగిసిందని, జిరాక్స్ పత్రాలు తీసుకోలేమని తేల్చి చెప్పారు. దీంతో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇలా ఖానాపురంలోనే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

సగం సగమే!

అసంపూర్తిగా పంట నష్టం సర్వే

- కార్యాలయాల చుట్టూ కౌలు, అర్హత రైతుల ప్రదక్షిణలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- నేటితో ముగియనున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ



ఆన్‌లైన్ నమోదు చేస్తున్న ఏఈఓ సంతోష్

జిల్లాలో పంట నష్టం అంచనా వివరాలు (ఎకరాల్లో)

మొక్కజొన్న	: 54,424
వరి	: 12,006
పత్తి	: 112.2
కూరగాయలు	: 1,998

ఖానాపురం: వడగళ్ల వర్షాలతో రైతుల కుటుంబాల్లో విషాదం అలుముకుంది. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి పండించిన పంట దిగుబడి సమయంలో వడగళ్ల వర్షానికి చేతికందకుండా పోయింది. నష్టపోయిన పంటలను పరిశీలించిన సీఎం కేసీఆర్ పంట నష్ట పరిహారం ఇవ్వాలని, తక్షణమే సర్వే చేపట్టాలని అధికారులు ఆదేశించిన విషయం విధితమే. అయితే అధికారులు అసంపూర్తిగా సర్వేలు చేసి కొంత మంది కౌలు, అర్హత రైతుల వివరాలను నమోదు చేయడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కురిసిన వడగళ్ల వర్షాలతో పంటలు తీవ్రంగా నష్టపోయాయి. వర్షాలతో నష్టపోయిన పంటలను అధికారులు ప్రాథమిక అంచనా వేసుకున్నారు. అనంతరం ప్రభుత్వం నుంచి సర్వే చేయాలని స్పష్టమైన ఆదేశాలు రావడంతో కస్టర్‌ల పరిధిలో సర్వేలు ప్రారంభించారు. సర్వే త్వరగా పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు రావడంతో అధికారులు సర్వే ముమ్మరం చేశారు. క్షేత్రస్థాయిలో రైతుల పంటలను పరిశీలించి, పరిహారం కోసం పట్టా, బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్ జిరాక్స్ ప్రతులను తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో జిరాక్స్ కాపీలను ఇవ్వడానికి రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగినా అందుబాటులో ఉండటం లేదు.

కౌలు రైతుల పరిస్థితి అగమాగం

వడగళ్ల వర్షాలతో మొదటి నుంచి కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పంటనష్ట పరిహారం కోసం భూ యజమానుల నుంచి పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వడంలో ఆలస్యం చేస్తుండటంతో అధికారులకు సకాలంలో అందించలేకపోతున్నారు. రైతుల నుంచి పూర్తి స్థాయిలో వివరాలు తీసుకోకుండా సర్వే ముగిసిందని తెలపడంతో ఆగ్రహిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో సాధ్యమేనా..

జిల్లాలో సర్వే ముగిసిన అనంతరం తగిన ఫార్మాట్ విధానంలో సమర్పించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దాని ప్రకారమే సర్వేలో సేకరించిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఫీల్డ్ సర్వే కూడా పూర్తి చేసుకున్నారు. పూర్తి చేసిన సర్వే వివరాలను నేడు (మంగళవారం) ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీంతో తీవ్ర ఒత్తిడితో కొంతమంది అధికారులు రాత్రి సమయాల్లో రైతు వేదికలో ఉంటూ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అటు ఉన్నతాధికారులు ఒత్తిడి, ఇటు రైతుల నుంచి వచ్చే ఇబ్బందులు తట్టుకోలేక అధికారులు సతమతమవుతున్నారు. సర్వే, ఆన్‌లైన్‌కు సమయం కేటాయిస్తే పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని రైతులు వేడుకుంటున్నారు.

జిరాక్స్‌లు తీసుకోలేదు..



తుంగబంధం పరిధిలో 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంట వేశాను. వడగళ్ల వానతో తీవ్రంగా నష్టపోయాను. అధికారులు సర్వేకు వచ్చి పరిశీలించారు. సర్వే సమయంలో జిరాక్స్ కాపీలు నా వద్ద లేకపోవడంతో ఇవ్వలేదు. అనంతరం నాలుగు రోజుల నుంచి వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్న. సోమవారంతో సమయం ముగిసిందని అంటున్నారు. మరికొంత సమయం పెంచి రైతుల నుంచి ఆధారాలు సేకరించాలి.

– ఉప్పుల వీరస్వామి, చెన్నారావుపేట

ఆదర్శప్రాయుడు దొడ్డి కొమురయ్య

- కలెక్టర్ పి.ప్రావీణ్య

వరంగల్ రూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీవత్స, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే, వరంగల్ ఆర్డీఓ సి.హెచ్.మహేందర్‌జీ, డీఆర్‌డీఓ సంపత్‌రావు, బీసీ సంక్షేమశాఖ అధికారి శంకర్‌నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రజాకార్ల ఆగడాలపై తిరుగుబాటు బావుట ఎగురవేశారన్నారు. నిజాం నవాబు నుంచి తెలంగాణ విముక్తి కోసం వీరోచిత పోరాటాలు చేశారని గుర్తు చేశారు. దిడ్డి కొమురయ్య సేవలు చిరస్మరణీయమన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

రేపు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

ఈనెల 5వ తేదీన (బుధవారం) ఉదయం 11 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో దేశ మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు.

సమీక్ష వాయిదా

జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖల అధికారులతో నిర్వహించాల్సిన సమీక్ష వాయిదా పడింది. తిరిగి నేడు నిర్వహించనున్నారు.

అవినీతి అధికారులపై చర్య తీసుకోవాలి

వర్ధన్నపేట: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మాదిగ రాజకీయ పోరాట సమితి వరంగల్ జిల్లా జేఏసీ కన్వీనర్ ఈరెల్లి శ్రీనివాస్ కోరారు. ఐబీ అధికారులు, కాంట్రాక్ట్ దారులతో కుమ్మక్కై వర్ధన్నపేట కోనారెడ్డి కట్ట మరమ్మతు పనులు నాసిరకంగా జరుగుతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు అధికారుల తీరుపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం లిఖిత పూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

పల్లెపల్లెకు ఓబీసీ పోస్టర్ ఆవిష్కరణ

గీసుకొండ: 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ నూతన జిల్లా కార్యాలయంలో 'పల్లెపల్లెకు ఓబీసీ.. ఇంటింటికి బీజేపీ' వాల్ పోస్టర్, కరపత్రాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేశ్, తదితరులు మాట్లాడారు.

'పది' పరీక్షలు షురూ



చెన్నారావుపేట: పరీక్ష సెంటర్‌కు వస్తున్న విద్యార్థినులు



ప్లాటినమ్ జూబ్లీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్, డీఈఓ

- మొదటి రోజు జిల్లాలో 18 మంది విద్యార్థులు గైర్హాజరు
- 21 పరీక్ష సెంటర్లలో వివిధ బృందాల తనిఖీ
- పరీక్ష పేపర్ లీక్ వార్తతో ఆందోళన



సంగెం: రూం నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

కాశీబుగ్గ సెంటర్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు సబ్జెక్టు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లాలో 293 పాఠశాలల విద్యార్థుల కోసం 56 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 9,728 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 9,710 మంది హాజరై 18 మంది గైర్హాజరు అయినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. వివిధ తనిఖీ బృందాలు 21 పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారని, అలాగే కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి వరంగల్‌లోని ప్లాటినమ్ జూబ్లీ హైస్కూల్, రంగశాయిపేట ప్రభుత్వ హైస్కూల్ (గరల్స్) రెండు పరీక్ష కేంద్రాలను సందర్శించామన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు ముందుగానే చేరుకున్నారని, ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా పోలీస్ శాఖ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు.

విద్యార్థుల ఆందోళన

మొదటి రోజు తెలుగు సబ్జెక్టు ప్రశ్న పత్రం వికారాబాద్ జిల్లాలోని తాండూరులో చోటుచేసుకున్న లీకేజీ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ అంశం మరవక ముందే టెన్త్ పరీక్ష పత్రం లీకేజీ వార్త గందరగోళానికి గురి చేసిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- కలెక్టర్ పి.ప్రావీణ్య
- ప్రజావాణికి 87 దరఖాస్తులు

వరంగల్ రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రావీణ్య,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీవత్స కోట, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు, ఆర్డీఓ మహేందర్ జీలు ప్రజావాణిలో ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరించారు. ఉద్యోగాలు ఇవ్వాలని, పెన్షన్లు మంజూరు చేయాలని, భూముల సమస్యలను పరిష్కరించాలని, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, సదరం సర్టిఫికెట్ జారీ చేయాలని, దళిత బంధు పథకం కింద రుణాలు మంజూరు చేయాలని దరఖాస్తులు సమర్పించారు. ప్రజావాణికి మొత్తం 87 అభ్యర్థనలు రాగా 31 భూ సమస్యలకు సంబంధించిన అభ్యర్థనలు ఉన్నాయి. కాగా ప్రజావాణికి చాలా మంది జిల్లా అధికారులు హాజరు కాకుండా వారి సహాయకులను పంపుతున్నారు. ఇప్పటి వరకు ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించకపోవడంతో అధికారుల్లో చర్చ జరుగుతుంది. ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఫిర్యాదుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



అభ్యర్థనలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

మా భూమిని ఆక్రమించుకున్నారు..



రాయపర్తి మండలం తిర్మలాయపల్లి శివారులోని సర్వే నంబర్ 76, 77, 78, 79, 80, 86, 87లలో మొత్తం 28.28 ఎకరాల భూమి ఉంది. ఇందులో మాకు వాటాగా రావాల్సిన భూమిని హైదరాబాద్ సెంట్రల్ జైలు లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న యాకాంతం రాకుండా అడ్డుపడుతున్నాడు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకొని మాకు రావాల్సిన భూమిని ఇప్పించగలరు.

– బానోతు రాజారాం, వర్ధన్నపేట

నగదు బదిలీ చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం గొల్లకురుమల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన నగదు బదిలీ పథకాన్ని గొల్లకుర్మలకు కూడా వర్తింపజేయాలి.జిల్లాలో మొదటి విడతలో 10,470 మంది లబ్ధిదారులకు గాను 10,189 మందికి గొర్రెల పంపిణీ జరిగింది. రెండో విడతలో 12,782 మంది లబ్ధిదారులకు రావాల్సి ఉంది. గొల్లకుర్మలకు కూడా నగదు బదిలీ అమలు చేయాలి.

– గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం నాయకులు



సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

నర్సంపేట: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడితో విచారణ చేయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్‌మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీ జరిగి ఇన్ని రోజులు గడుస్తున్న సీఎం కేసీఆర్ స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. నష్టపోయిన ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందించాలన్నా రు. ఈనెల 11న ఇందిరాపార్క్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహాదీక్ష చేపట్టనున్నట్లు తెలిపా రు. నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్, ఉపాధ్యక్షులు శివరాత్రి అనిల్, నాయకులు మానస, రాకేష్, ప్రశాంత్, వినోద్, తరుణ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమశాఖ అధికారిగా బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న భాగ్యలక్ష్మిరెడ్డి

వరంగల్ రూరల్: జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారిగా పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా దళిత అభివృద్ధి శాఖ జిల్లా అధికారిగా పదోన్నతిపై వరంగల్ జిల్లాకు బదిలీపై వచ్చారు.



క్లుప్తంగా

పోలీసులమని చెప్పి పాస్టర్‌పై దాడి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి చర్చిలో పాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కార్తీక్‌పై దాడి జరిగింది. ఆదివారం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో, మార్గమధ్యలో ఇద్దరు వ్యక్తులు కార్తీక్‌ను అడ్డగించారు. సివిల్ యూనిఫాంలో ఉన్న తామిద్దరం పోలీసులమంటూ అకారణంగా తనను చితకబాదినట్లు కార్తీక్ తెలిపారు. తాను చర్చి పాస్టర్‌నని చెబుతున్నప్పటికీ వినలేదని కార్తీక్ పేర్కొన్నారు. ఈఘటనలో కార్తీక్ చెవి, ముఖంపై బలమైన గాయలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హసన్‌పర్తి ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. కాగా.. పోలీసుల పేరుతో దాడికి పాల్పడిన వారు అసాంఘిక శక్తులా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. దాడి విషయమై సోమవారం పాస్టర్లు సీపీని కలిసి ఫిర్యాదు చేశారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

- ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ
- బీజేపీ కార్యాలయం ఎదుట ధర్నా


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

హన్మకొండ: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి ఆమోదం తెలిపేలా బీజేపీ జిల్లా నాయకత్వం రాష్ట్ర, జాతీయ నాయకులపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యాలయం ఇన్‌చార్జ్ చల్ల జయపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు గద్దల సుకుమార్, జన్ను దినేశ్ మాదిగ, మంద రాజు మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ, బొక్కల నారాయణ మాదిగ, రాజారావు భిక్షపతి మాదిగ, చేతల్ల శివ మాదిగ, చిలువేరు సంపత్ మాదిగ, శనిగరపు రవీందర్ మాదిగ, నద్దునూరి ప్రసాద్ మాదిగ, మస్కే సదయ్య మాదిగ పాల్గొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు -
డ్రెస్డ్ చికెన్ రేటు -
స్కిన్‌లెస్ చికెన్ రేటు -
Cell: 9989299661

ప్రాణం ఉన్నంత వరకు అనుబంధం

- చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- టీఎన్జీఓస్ హనుమకొండ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న టీఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, తదితరులు

హన్మకొండ: ఉద్యోగులతో 30 ఏళ్ల అనుబంధం ఉందని, గొంతులో ప్రాణం ఉన్నంత వరకు ఉద్యోగులతో అనుబంధం కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. టీఎన్జీఓస్ యూనియన్ హనుమకొండ జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగులు కోలాటాం ఆడుతూ, బతుకమ్మలతో కలెక్టరేట్ నుంచి ఆడిటోరియానికి ర్యాలీగా చేరుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన వినయ్‌భాస్కర్, టీఎన్జీఓస్ యూనియన్ కేంద్ర సంఘం (రాష్ట్ర) అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్ పాల్గొని యూనియన్ 2023 డైరీని ఆవిష్కరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఈసందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలైన ఆదాయపు పన్ను పరిధి, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై ఉద్యోగులు పోరాడాలన్నారు. కడిపికొండ ప్లాట్ల సమస్యను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో చర్చించి పరిష్కరిస్తానని తెలిపారు. టీఎన్జీఓస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ మాట్లాడుతూ.. కడిపికొండలో ఉద్యోగులకు ప్లాట్లు ఇప్పించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. యూనియన్ కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసుకునే ఏకైక సంఘం టీఎన్జీఓస్ యూనియన్ అన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యోగులకు ఈపీఎఫ్ పెన్షన్ సౌకర్యం, ఆదాయపు పన్ను పరిధి పెంపుతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి యూనియన్ పోరాడుతోందన్నారు. సమావేశంలో 31 తీర్మానాలను ఆమోదించారు. జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో


సమావేశానికి హాజరైన ఉద్యోగులు

మేయర్ గుండు సుధారాణి, డీఆర్డీఏ ఆకవరం శ్రీనివాస్‌కుమార్, వేయి స్తంభాల దేవాలయ అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్ పనికెల రాజేశ్, శ్యాంసుందర్, కత్తి రమేశ్, రాము నాయక్ పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు మహారాష్ట్ర బాధిత యువకుడి ట్వీట్

కాళేశ్వరం: తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీకి అవతలి వైపున మహారాష్ట్ర బాధిత రైతులు తమను ఆదుకోవాలని మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా ట్వీట్ చేశారు. సోమవారం సిరొంచకు చెందిన రామ్‌రంగువార్ అనే యువకుడు సిరొంచ పరిధిలోని 12 గ్రామాల రైతులు మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీ నిర్మాణం బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురవుతున్న 128 హెక్టార్ల భూమికి రూ.25 కోట్ల నష్ట పరిహారం తెలంగాణ ప్రభుత్వం తరపున రావాల్సి ఉందని ట్వీట్‌లో పేర్కొన్నారు. గతంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులకు పోస్టుకార్డుల ద్వారా సిరొంచ రైతులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మరో కొత్త పంథాలో ట్విట్టర్ ద్వారా ట్వీట్‌లు చేస్తూ తమ సమస్యను వివరిస్తున్నారు. అక్కడి ప్రభుత్వం తెలంగాణకు లేఖ ద్వారా పరిహారం చెల్లించాలని తెలిపినట్లు ట్వీట్‌తో యువకుడు వివరించాడు. మంత్రి స్పందిస్తారా? లేదా చూడాలని బాధిత రైతులు ఎదురు చూస్తున్నారు.


మహారాష్ట్ర యువకుడు మంత్రికి చేసిన ట్వీట్

ప్రారంభమైన శత చండీ మహాయాగం


శతచండీ మహాయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

కాజీపేట అర్బన్: మాంగళ్య షాపింగ్ మాల్, పిఎస్.మూర్తి అండ్ ఫ్యామిలి, కాసం పుల్లయ్య అండ్ సన్స్ ఆధ్వర్యంలో హంటర్ రోడ్డులోని వారి స్వస్థలంలో నిర్వహిస్తున్న మూడ్రోజుల శతచండీ మహాయాగం సోమవారం తొలి రోజు భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. గణపతి పూజ, శతచండీ కలశ స్థాపనతో లోక కల్యాణానికి, సమాజ శాంతికి శత చండీ మహాయాగాన్ని శ్రీ బ్రహ్మశ్రీ దేందుకూరి వెంకటేశ్వర గణాపాఠి నేతృత్వంలో ఉపాసకులు, వేద పండితులు, ఆగమ పండితులు ప్రారంభించారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

హసన్‌పర్తి: వివిధ ప్రాంతాల నుంచి ఎండు గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్న ఓ ముఠాను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 1,100 గ్రాముల ఎండు గంజాయి, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితులను కోర్టులో హాజరుపర్చారు. హసన్‌పర్తి మండలం దేవన్నపేటకు చెందిన టప్ప నవీన్ కొంతకాలంగా గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఎండు గంజాయిని ఖరీదు చేసి వాటిని చిన్న చిన్నప్యాకెట్లు ప్యాక్ చేసి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న విద్యాసంస్థలు, యువతకు విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అతడి ఇంటిపై దాడులు నిర్వహించారు. అతడి నుంచి 500 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుంది. అదేవిధంగా మహబూబాబాద్ తొర్రూరు మండలం కంటాయపాలెంకు చెందిన బొదపల్లి అన్వేశ్ నుంచి గంజాయి కొని, విద్యార్థులు, యువత, కూలీలకు విక్రయిస్తున్నట్లు విచారణలో నవీన్ వెల్లడించారు. ఈమేరకు అన్వేశ్‌ను అరెస్ట్ చేసి అతడి నుంచి 600 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్‌రావు, ఎస్సైలు నిషార్, లవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నిందితులను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

జాయింట్ సర్వే చేయాలి

హసన్‌పర్తి: నగరంలోని 56వ డివిజన్ గోపాలపురం చెరువును రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే చేయడానికి వచ్చారు. క్షేత్రస్థాయికి చేరుకున్న అధికారులు చెరువు, మ్యాప్‌ను పరిశీలించారు. జాయింట్ సర్వేకు అక్కడి వారు పట్టుపట్టడంతో వెనుదిరిగారు. గోపాలపురంలో చెరువు కబ్జా అయినట్లు చెరువు పరిరక్షణ కమిటీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో తొమ్మిది శాఖల అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సోమవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించడానికి రాగా.. రెవెన్యూ, నీటి పారుదల శాఖ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించాలని చెరువు పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. సర్వే నంబర్ 89లో 20.10 ఎకరాలు చెరువు ఉందని, ఈ చెరువు కింద ఆయకట్టు లేకపోవడం వల్ల రియల్టర్ల కన్ను చెరువుపై పడిందని కమిటీ సభ్యులు ఆరోపించారు. దీంతో రియల్టర్లు చెరువునే వెంచర్‌గా చేసి అమ్మారని పరిరక్షణ కమిటీ ఆరోపించింది.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రికార్డుల తయారు

చెరువు మధ్యలో 3.09 కరాలు పట్టా భూమి రికార్డులు సృష్టించారని పరిరక్షణ కమిటీ ఆరోపించింది. 1954 సెత్వార్‌లో మాత్రంలో అలాంటివేవీ లేవని, జాయింట్ సర్వే చేసి హద్దులు నిర్ధారిస్తే ఏమేరకు శిఖం కబ్జా అయ్యిందో తెలుస్తుందని చెరువు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు దశరథం అన్నారు. ఇందులో అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ నల్లాల శ్రీనివాస్, అమరావతి నగర్ యూత్ అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల్ని నిబంధనల మేరకు ఖర్చు చేయాలి

- మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ పి.రవికుమార్
- ఘన్‌పూర్‌లో 17 వ్యవసాయ మార్కెట్ల కార్యదర్శులతో సమీక్ష

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ నుంచి వచ్చే నిధులను వ్యవసాయ మార్కెట్ల కార్యదర్శులు నిబంధనల మేరకు ఖర్చు చేయాలని మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ పి.రవికుమార్ ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 17 వ్యవసాయ మార్కెట్లకు గతేడాది 2022–23కు సంబంధించి మార్కెట్‌ల ఆదాయ, వ్యయాలు, ప్రస్తుత 2023–24 సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపులపై ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఘన్‌పూర్ మార్కెట్ కార్యదర్శి జి.జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డైరెక్టర్ ఒక్కో వ్యవసాయ మార్కెట్‌కు సంబంధించి ఆదాయ, వ్యయాలు, బడ్జెట్ కేటాయింపు అంశాలపై ఆయా మార్కెట్ల కార్యదర్శులతో కూలంకశంగా సమీక్ష చేశారు. ఆయా మార్కెట్‌ల కార్యదర్శులు తమ మార్కెట్‌కు వచ్చిన ఆదాయాలు, ఖర్చులు, ప్రస్తుత సంవత్సరానికి కావాల్సిన నిధులు, అవసరాలు, చేయాల్సిన పనులు తదితర అంశాలను అడిషనల్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సమీక్ష జరిగింది. ఈసందర్భంగా మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ గతంలోనే టెండర్ పూర్తయి పెండింగ్‌లో ఉన్న పనులను బడ్జెట్ కేటాయిస్తామన్నారు. మార్కెట్ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలని, బడ్జెట్ ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖర్చులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ ఎం.శ్రీనివాస్, ఆర్‌జేడీ వరంగల్ మల్లేశం, డీడీఎం అజ్మీర రాజునాయక్, డీఎంఓలు నాగేశ్వరశర్మ, ప్రసాద్‌రావు, సూర్యకాంత్, కనకశేఖర్, సుచిత్ర, సురేఖ, ఘన్‌పూర్ మార్కెట్ కార్యదర్శి జి.జీవన్‌కుమార్‌తో పాటు వివిధ మార్కెట్‌ల కార్యదర్శులు, సిబ్బంది తాటికొండ శ్రీనివాస్, గట్టు కిషన్, షేక్ షరీఫ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ పి.రవికుమార్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Ed SEATS AVAILABLE

B.Ed Seats Available 2022- 24 Batch, Rayalaseema University, Kurnool, Few Seats Only. Cell: 6303380836. [W-785506]

REAL ESTATE

భూమి అమ్మబడును

గీసుకొండ, పోలీస్ స్టేషన్‌కు 1 కిలోమీటర్ లోపు అగ్రికల్చర్ భూమి 2 గుంటలు, 3గుంటలు, 5 గుంటలు, 10 గుంటలు అతి తక్కువ ధరకు అమ్మబడును. సంప్ర॥ 9908862995. [W-785476]

అద్దెకు లభించును

సుబేదారి పోస్టాఫీస్ వెనుక 4500 sft 3 ఫ్లోర్లు, ఆఫీసుకు/ క్లినిక్‌కు / కంప్యూటర్ సెంటర్‌కు/ కోచింగ్ సెంటర్‌కు/ రీడింగ్ రూమ్స్‌కు/ హాస్టలుకు - కిరాయకు ఇవ్వబడును. సెల్: 9291707707, 9848072185. [WA-6937]

FLATS FOR SALE

KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26881]

HOUSE FOR SALE

ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26882]

వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26883]

ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26884]

PLOT FOR SALE

కేవలం 2 లక్షలకే 121 చ.గ. ఫామ్ ప్లాట్ కొనండి. ప్రతి ప్లాట్‌పై ఖచ్చితమైన బహుమతులు గెలుపొందండి. Breeza కారు,హీరో బైక్స్-10, LED T.V. లు-10, A/C లు -10 మరెన్నో బహుమతులు. 9154047151, 9700518878. [WA-6935]

GWMC - KUDA పరిధిలోని 3300 చ॥గ॥ ఏనుమాముల మార్కెట్ మేన్‌గేట్‌కి ఎదురుగా 2 సైడ్ రోడ్స్ ఫేసింగ్ భూమి అమ్మకానికి కలదు. సంప్ర॥ 9440290009, 9441689294. [W-785507]

SERVICES

హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును, బెట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి ఆర్థిక సహాయం చేయబడును. హన్మకొండ. సెల్: 8331878592. [WA-6934]

LOANS

హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్థులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL. 9618767116 [W-785473]

WANTED

ప్రముఖ కృష్ణవేణి కాలేజ్ (HNK) లో కావలెను. మేనేజర్(M), కంప్యూటర్ ఆపరేటర్ (M), వార్డెన్ (MF), Maths, Phy, Chem, Bot, Zoology, JLS & SLS (Male), JLS, SLS అనుభవం compain చేయువారికి ప్రాధాన్యత. సెల్: 9949610729. [WA-6940]

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ జనగామ ఏరియాలో పనిచేయుటకు Sales Executives కావలెను. ఆకర్షణీయమైన జీతం మరియు ఇన్సెంటివ్స్ మరియు బోనస్ లభించును. అర్హత: డిగ్రీ వయస్సు 27 సంవత్సరాలలోపు ఉన్న వారికి అవకాశం. సెల్: 8978380199 [W-785477]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K.ఫోన్: 9848571888 [H-793408]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 83500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190662]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795295]

అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 77308 99503 [G-536]

ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బిల్లులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000–20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 90004 08325 [G-795293]

WANTED TEACHERS

(1) Pre-Primary 5 - Female Teachers need (passion to teach for pre-primary) (2) High School Teachers (All Subjects needed). Come with Resume on 2,3,4,5 of April. Time:10am-12:30 pm & 2.30pm-4pm. Smile Digi School, Reddy Colony, HNK. 9542557733, 7794924779. [WA-6936]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాటిచెట్టు నుంచి పడి గీత కార్మికుడి మృతి


దేవేందర్ (ఫైల్)


దేవేందర్ మృతదేహం

మొగుళ్లపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఆకినపల్లి గ్రామానికి చెందిన గండు దేవేందర్ (48) తాటి చెట్టు నుంచి పడి సోమవారం మృతి చెందాడు. దేవేందర్ వృత్తిలో భాగంగా ఆకినపల్లి శివారులో తనకున్న తాటి చెట్టువద్దకు రోజూ మాదిరిగానే ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో తన మోకు జారి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు బలమైన గాయమవడంతో దేవేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు..

రఘునాథపల్లి: విద్యుత్ షాక్‌తో మండలంలోని వెల్ది శివారు రఘునాథపల్లి గ్రామానికి చెందిన మినుముల మాధవరెడ్డి అలియాస్ చందర్‌రెడ్డి (45) సోమవారం మృతి చెందాడు. చందర్‌రెడ్డి కొన్నాళ్లుగా వెల్ది శివారులోని వీర రాజేశ్వర బ్రికటింగ్ కంపెనీలో డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అక్కడే ఓ రేకుల షెడ్డులో నివాసముంటున్నాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉపశమనం కోసం షెడ్డు రేకులపై సోమవారం ఉదయం గోనె సంచులు కప్పుతున్నాడు. ఈక్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్సై వీరేందర్

వీధి కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

చిన్నగూడూరు: మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో సోమవారం వీధి కుక్కలు ఏడుగురిపై దాడి చేసి గాయపర్చాయి. గ్రామానికి చెందిన మూడేళ్ల బాలిక లిఖితశ్రీ, బాలుడు సమీర్, ఐదేండ్ల బాలిక సోనీ, పవన్, సోమ్లా, ఉపేంద్రాచారిపై దాడి చేసి గాయపర్చాయి. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

గార్డు ఎక్కకుండానే వెళ్లిపోయిన రైలు!

- వరంగల్ వెళ్లి మళ్లీ విధులు నిర్వహించిన గార్డు

కాజీపేట రూరల్: న్యూఢిల్లీ–చెన్నై వైపు వెళ్తున్న ఒక ప్రయాణికుల స్పెషల్ ట్రైన్ గార్డు దిగి ట్రైన్ చక్రాలను, బ్రేక్‌లను తనిఖీ చేస్తుండగా..సిగ్నల్ ఇవ్వడంతో ఆ స్పెషల్ ట్రైన్ చెన్నై బయల్దేరి వెళ్లింది. సోమవారం కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో జరిగింది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం. ఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే స్పెషల్ ట్రైన్ కాజీపేట టౌన్ స్టేషన్‌లో ఆగింది. అందులో ఉన్న రైల్వే గార్డు దిగి ట్రైన్‌ను తనిఖీ చేస్తున్నాడు. దిగిన గార్డు ముందు ఉన్న ఇంజన్ డ్రైవర్ ఒకరికొకరు కనిపించలేదు. దీంతో గార్డు సిగ్నల్ ఇచ్చింది తెలియలే. ఇంతలో సిగ్నల్ ఇవ్వడంతో ఆగిన ట్రైన్ బయల్దేరి వెళ్లింది. దీంతో హైరానా పడ్డ గార్డు వాకీటాకీ ద్వారా ఆ ట్రైన్ పైలెట్, అధికారులకు, సమాచారం ఇచ్చాడు. గార్డుకు ఫోన్ చేయగా టౌన్ స్టేషన్‌లోనే ఉండిపోయానని చెప్పినట్లు తెలిపారు. అనంతరం గార్డు హుటాహుటిన వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. వరంగల్ నుంచి తాను వెళ్లాల్సిన స్పెషల్ ట్రైన్‌లో గార్డు యాథావిధిగా విధులపై వెళ్లినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వింత ఘటనలు..

కాజీపేట జంక్షన్ అకౌంట్‌లో ఉన్న రైలు ఇంజన్ కొన్నేళ్ల క్రితం తప్పిపోగా.. దేశం మొత్తంలో ఉన్న అన్ని రైల్వే డివిజన్‌లలో రైల్వే అధికారులు వెతికి ఎట్టకేలకు గుర్తించి కాజీపేట జంక్షన్‌కు తీసుకచ్చారు. గురువారం ఘన్‌పూర్‌స్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా.. ప్రయాణికుడి చెప్పు జారి కిందపడిపోగా ఆ ప్రయాణికుడు రైల్వే ట్విట్టర్ ఫిర్యాదు చేయగా.. ఆర్పీఎఫ్ పోలీసులు వెతికి అప్పగించారు. సోమవారం ట్రైన్‌లో విధులు నిర్వహిస్తున్న ఒక గార్డు కాజీపేట టౌన్ స్టేషన్‌లో ఆగగా గార్డు దిగి తనిఖీ చేస్తుండగా ఆ ట్రైన్ కాస్త వెళ్లిపోయింది. ఇలాంటి వింత ఘటనలు రైల్వేలో జరుగడంతో అటు ప్రయాణికులు, ఇటు రైల్వే అధికారులు హైరానా పడుతున్నారు.

పసి ప్రాణాన్ని బలిగొన్న ఆట

- ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి


కృష్ణ(ఫైల్)

మరిపెడ రూరల్: ఆట ఓ ఐదేళ్ల బాలుడి ప్రాణాన్ని బలిగొంది. ట్రాక్టర్ చక్రాల కింద పడి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం మూల మర్రితండాకు చెందిన భూక్య లచ్చ, లక్ష్మి దంపతుల కుమారుడు భూక్య కృష్ణ(5) సోమవారం మృతి చెందాడు. కృష్ణ మరో బాలుడితో కలిసి తండా శివారులోని మిర్చి కల్లం వద్ద ఆడుకుంటున్నారు. ఈక్రమంలో మిర్చికల్లం వద్దకు ఓ వ్యక్తి ట్రాక్టర్ ఇంజన్‌ను తీసుకొచ్చి అక్కడే నిలిపి తాళం ట్రాక్టర్‌కే ఉంచాడు. అక్కడే ఆడుకుంటున్న పిల్లలిద్దరూ వెళ్లి ట్రాక్టర్ ఎక్కి ఆడుకుంటున్నారు. ఇంతలో ఐదో తరగతి చదువుతున్న మరో బాలుడు ట్రాక్టర్‌కు ఉన్న తాళం తిప్పడంతో ట్రాక్టర్ స్టార్ట్ అయి ఒక్కసారిగా ముందుకు కదిలింది. దీంతో ట్రాక్టర్‌పై కూర్చున్న కృష్ణ కిందపడ్డాడు. అతడి మీది నుంచి టైర్ వెళ్లింది. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే బాలుడిని ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో బాలుడు మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాలుడి తండ్రి లచ్య ఫిర్యాదు మేరకు మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోరాటానికి స్ఫూర్తి దొడ్డి కొమురయ్య



నివాళులర్పిస్తున్న వీసీ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు


నివాళులర్పిస్తున్న సీపీ రంగనాథ్

- కేయూ వీసీ రమేశ్

కేయూ క్యాంపస్: తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి దొడ్డి కొమురయ్య అని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. సోమవారం కేయూలోని బీసీ సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలోని అకాడమిక్ కమిటీ హాల్‌లో దొడ్డి కొమురయ్య 96వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి విద్యార్థులు యువత దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. అణచివేతపై దొడ్డి కొమురయ్య పోరాడారన్నారు. దొడ్డికొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేశ్‌లాల్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.వరలక్ష్మి, సోషల్ సైన్స్ డీన్ విజయబాబు, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, కేయూ అభివృద్ధి అధికారి పంతంగి వెంకటేశ్వర్లు, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సదానందం, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ డాక్టర్ కోల శంకర్ పాల్గొన్నారు.

కమిషనరేట్ కార్యాలయంలో..

వరంగల్ క్రైం: తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్యని స్ఫూర్తిగా తీసుకొని నిరుపేదలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు మురళీధర్, అదనపు డీసీపీ పుష్పా, సంజీవ్, సురేశ్ కుమార్, ట్రైనీ ఐపీఎస్ అంకిత్‌కుమార్, ఏసీపీలు నాగయ్య, అంతయ్య, కృష్ణ, ఆర్ఐలు నగేశ్, చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు రమేశ్, సుజాత, భాస్కర్, పరిపాలన విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘సంపర్క్ క్రాంతి’లో ప్రయాణికుడికి అస్వస్థత

కాజీపేట రూరల్: తిరుపతి–హజరత్ నిజాముద్దీన్ వెళ్లే ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు సోమవారం మార్గమధ్యలో అస్వస్థతకు గురయ్యాడు. ప్రయాణికుడు అస్వస్థతకు గురైన విషయాన్ని ట్రైన్ సిబ్బంది కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వగా.. కంట్రోల్‌రూమ్ సిబ్బంది కాజీపేట రైల్వే స్టేషన్ అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో రైలు వచ్చే సమయానికి అధికారులు రైల్వే ఆస్పత్రి వైద్య సిబ్బందిని పిలిపించి సిద్ధం చేశారు. ప్రయాణికుడికి వైద్య సిబ్బంది చికిత్స చేసి అదే రైల్లో పంపించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.